సాక్షి ఖమ్మం
శుక్రవారం । 29 । మార్చి । 2024




రైల్వేలైన్ల సర్వేలతో ఆందోళన
జిల్లా మీదుగా రెండు కొత్త రైల్వేలైన్ల నిర్మాణానికి మార్కింగ్ చేస్తుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. 12లో



ఒకేరోజు ఏడు అబార్షన్లు..
ఖమ్మంలోని సుగుణ ఆస్పత్రిలో నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు చేస్తున్నట్లు తేలడంతో అధికారులు సీజ్ చేశారు. 10లో

గరిష్టం / కనిష్టం
40° / 22°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం ఎండల ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత గరిష్టస్థాయికి చేరుతుంది.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్రవారం సా॥) 6.27
సహర్ (శనివారం ఉ॥) 4.43

ఏకాభిప్రాయం కుదరట్లే!



ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ
- తమ కుటుంబీకులకే కావాలని మంత్రుల పట్టు
- హైదరాబాద్ నుంచి ఢిల్లీకి చేరిన టికెట్ కసరత్తు
- ఎటూ తేల్చుకోలేకపోతున్న పార్టీ అధిష్టానం
- ఈనెల 31న చివరి జాబితాలో ప్రకటించే అవకాశం

ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ పార్టీ ఎటూ తేల్చుకోలేకపోతోంది. మొన్నటి వరకు హైదరాబాద్‌లో కసరత్తు జరగగా ఇప్పుడు ఢిల్లీకి చేరింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కుటుంబీకులు టికెట్ రేసులో ఉండగా.. మరికొందరూ టికెట్ ఆశిస్తున్నారు. ఇటీవల రెండుసార్లు టికెట్ విషయమై రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ ఆధ్వర్యాన పార్లమెంట్ స్థానం పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశం జరిగింది. అయినా అభ్యర్థి ఎంపికపై ఏకాభిప్రాయం రాకపోగా, తమ కుటుంబానికే టికెట్ ఇవ్వాలని ప్రధానంగా భట్టి, పొంగులేటి పట్టుబడుతున్నారు. దీంతో చివరకు ఎవరిని అభ్యర్థిగా నిర్ణయిస్తారు.. ఇతర ఆశావహుల వైపు పార్టీ ఆలోచన చేస్తుందా అన్న అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం

హస్తినలో లాబీయింగ్
కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని ఖమ్మం, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ మినహా మిగతా స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. తొలి జాబితాలోనే ఖమ్మం అభ్యర్థి ప్రకటన ఉంటుందని ఊహించిన ఆశావహులకు నిరాశే ఎదురైంది. ప్రకటన ఆలస్యమవుతుండగా ఆశావహులు టికెట్ కోసం తమ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేస్తున్నారు. ఢిల్లీలో మకాం వేసి లాబీయింగ్‌లో నిమగ్నమయ్యారు. తాజాగా జరిగిన కమిటీ సమావేశానికి రాష్ట్రం నుంచి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు ఆశావహులు కూడా ఢిల్లీ చేరుకుని ఎన్నికల కమిటీ భేటీలో తమ పేరు ప్రస్తావనకు వచ్చిందా.. లేదా అని ఆరా తీశారు. ఇదే రోజు ఖమ్మం అభ్యర్థి ప్రకటన ఉంటుందని భావించినా, ఎన్నికల కమిటీ పెండింగ్‌లో పెట్టింది.

ఎవరికి దక్కేనో..?
ఖమ్మం స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరనే చర్చ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోంది. ఇక్కడి నుంచి ముగ్గురు మంత్రులు ఉండడంతో వారి కుటుంబీకుల్లో ఒకరికి టికెట్ ఇస్తారా, లేక మిగతా ఆశావహులకు అధిష్టానం ఆశీస్సులుంటాయా.. అన్న ఉత్కంఠకు తెరపడడం లేదు. రోజురోజుకూ కొత్త వారి పేర్లు ప్రచారంలోకి వస్తుండడం గమనార్హం. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని, మంత్రి పొంగులేటి సోదరుడు ప్రసాద్‌రెడ్డి, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్, వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, పార్టీ నాయకులు జెట్టి కుసుమకుమార్, జావిద్, నాగ సీతారాములు, లోకేష్‌యాదవ్, మానుకొండ రాధా కిషోర్ టికెట్ ఆశిస్తూ తమ నేతల ద్వారా ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

ఈనెలాఖరులో..
కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ ఈనెల 31న ఢిల్లీలో సమావేశమై ఖమ్మం, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించనుందని తెలుస్తోంది. దీంతో ఈ రెండు రోజుల్లో ఏయే మార్పులు జరుగుతాయి, టికెట్ ఎవరికి దక్కుతుందని ఆశావహులు ఆలోచనలో పడ్డారు.

ఖమ్మం స్థానానికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామా నాగేశ్వరరావు, బీజేపీ అభ్యర్థిగా తాండ్ర వినోద్‌రావును ఇప్పటికే ప్రకటించారు. ఇందులో బీజేపీ అభ్యర్థి ప్రచారం మొదలుపెట్టగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి ఈ నెలాఖరు నుంచి ప్రచారానికి సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటిస్తే పార్లమెంట్ ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుంది. అయితే, అభ్యర్థిని త్వరగా ప్రకటిస్తేనే.. విజయంతో పాటు మెజార్టీ పెరిగే అవకాశాలుంటాయని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

తెరపైకి ప్రియాంకగాంధీ!
అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవడంతో ఖమ్మం లోక్‌సభ స్థానం కూడా సునాయాసంగా తమ ఖాతాలో చేరుతుందని పార్టీ భావిస్తోంది. అయితే టికెట్ కోసం మంత్రుల కుటుంబీకులు, మరోవైపు ముఖ్య నేతలు పోటీ పడుతుండడంతో అభ్యర్థి ఎంపిక కొలిక్కి రావడం లేదు. ఈనేపథ్యాన వీరెవరికీ కాకుండా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని ఇక్కడ నుంచి బరిలో దించాలని అధిష్టానం ఆలోచన చేసినట్లు సమాచారం. ఆమె ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి పోటీకి దిగుతుండగా.. రెండు స్థానాల నుంచి పోటీ చేస్తారా.. లేదా అన్నది తేలాల్సి ఉంది. ఆమె నిరాకరించే పక్షంలో రేసులో ఉన్న ఒకరికి ఈ టికెట్ కేటాయించనున్నారు.

న్యూస్‌రీల్

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు



చెక్‌పోస్టు వద్ద తనిఖీని పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

కారేపల్లి: అంతర్రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీ చేస్తూ ఎన్నికల నియమావళిని పక్కాగా అమలుచేయాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. కారేపల్లిలో ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కేంద్ర పోలీసు బలగాలతో పాటు స్థానిక పోలీసులు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని, ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తూ మద్యం, నగదు అక్రమంగా రవాణా చేయకుండా చూడాలని తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50వేలకు మించి నగదు, ఆభరణాలు తీసుకెళ్లే వారు సంబంధిత పత్రాలు సమర్పించేలా అవగాహన కల్పిస్తామని సీపీ పేర్కొన్నారు. అనంతరం కారేపల్లి పోలీసుస్టేషన్‌లో రికార్డులను పరిశీలించి ఎస్‌ఐ రాజారాంతో పలు అంశాలపై సమీక్షించారు.

75మంది విద్యార్థుల గైర్హాజరు



ఖమ్మం సహకారనగర్: జిల్లాలో గురువారం జరిగిన పదో తరగతి పరీక్షకు 16,781మంది విద్యార్థుల్లో 16,706మంది హాజరు కాగా 75మంది గైర్హాజరయ్యారు. ఈవిషయాన్ని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ వెల్లడించారు. కాగా, అదనపు కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్, పరీక్షల అబ్జర్వర్, అసిస్టెంట్ కమిషనర్‌తో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను పలు కేంద్రాలను తనిఖీ చేశాయని తెలిపారు.

జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు వాయిదా
ఖమ్మంవన్‌టౌన్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు తెలిపారు. ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం సమావేశం కాగా, లోక్‌సభ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మళ్లీ సమావేశాలు ఎప్పుడు నిర్వహించేది ఎన్నికల తర్వాత వెల్లడిస్తామని తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక
నేలకొండపల్లి: జిల్లాలో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఎదురయ్యే తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు గ్రామాల వారీగా తాగునీటి సరఫరాకు అనువుగా ఉన్న వ్యవసాయ బోర్లు, బావుల వివరాలను అందించాలని అధికారులకు కలెక్టర్ నుంచి ఇటీవల ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రతీ గ్రామానికి సమీపంలో ఉన్న వ్యవసాయ బోర్లు, బావులు, అందులో నీటి లభ్యత వివరాలు అందించాలని సూచించారు. తద్వారా గ్రామంలోని నీటి వనరులు ఎండిపోతే ఆయా బావుల నుంచి సరఫరాకు ఉన్న సాధ్యాసాధ్యాలపై ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నట్లు సమాచారం. దీంతో జిల్లాలోని 589 గ్రామపంచాయతీల కార్యదర్శులు, రెవెన్యూ ఉద్యోగులు వివరాలు సేకరించి నివేదికలను తహసీల్దార్లకు సమర్పించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన
పాల్వంచరూరల్ : పాల్వంచ మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ జి.సుదర్శన్, అర్చకులు, వేద పడింతులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

చకచకా మూల్యాంకనం

- జిల్లాకు 2,75,176 ఇంటర్ జవాబుపత్రాలు
- ఇప్పటికే నాలుగు సబ్జెక్టులు పూర్తి
- మిగతావి 6వ తేదీలోగా ముగింపు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం జిల్లాలో వేగంగా జరుగుతోంది. ఈనెల 19వ తేదీన వార్షిక పరీక్షలు ముగియగా... తొలుత సంస్కృతం జవాబుపత్రాలు, ఆతర్వాత ప్రధాన సబ్జెక్టుల మూల్యాంకనం మొదలుపెట్టారు. ఖమ్మంలోని నయాబజార్ పాఠశాలలో వాల్యూయేషన్ చేస్తుండగా.. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 2,75,176మంది జవాబుపత్రాలు ఇక్కడకు పంపించారు.

రెండు కేంద్రాలు ఉండడంతో..
2016లో కొత్త జిల్లాలు ఏర్పడినా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కొన్నాళ్లు ఒకే వాల్యూయేషన్ కేంద్రం కొనసాగింది. దీంతో జవాబుపత్రాలు ఎక్కువగా రాగా, మూల్యాంకనంలో జాప్యం జరిగేది. అయితే, ఈసారి భద్రాద్రి జిల్లాలోనూ వాల్యూయేషన్ సెంటర్ ఏర్పాటుచేయడంతో ఇక్కడకు తక్కువ జవాబు పత్రాలు రావడంతో ప్రక్రియ చకచకా సాగుతోంది. ఇప్పటికే తెలుగు, హిందీ, పొలిటికల్ సైన్స్, చరిత్ర సబ్జెక్టులకు సంబంధించి 1,59,270జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తికాగా, మిగతా సబ్జెక్టులవి 1,15,906 జవాబుపత్రాలు ఉన్నాయి. ఇవన్నీ ఏప్రిల్ 6నాటికి పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

1,072 మంది..
వాల్యూయేషన్ క్యాంప్ ఆఫీసర్‌గా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు వ్యవహరిస్తున్నారు. ఈమేరకు 1,072మంది ఉద్యోగులను కేటాయించగా, రోజుకు 715మంది చొప్పున విధుల్లో పాల్గొంటూ 30చొప్పున జవాబుపత్రాలను మూల్యాంకనం చేస్తున్నారు. ఏప్రిల్ 6వ తేదీ నాటికి ముగించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీఐఈఓ కె.రవిబాబు తెలిపారు. సీసీ కెమెరాల నిఘా నడుమ మూల్యాంకనం పకడ్బందీగా చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.

తుపాకులు వెనక్కి..



- ఎన్నికల కోడ్‌తో డిపాజిట్
- ఇప్పటికే ఇచ్చేసిన కొందరు
- మిగతా వారికి పోలీసు శాఖ నోటీసులు

ఖమ్మంక్రైం: లోక్‌సభ ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో అధికారులు భద్రతపై దృష్టి సారించారు. ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా అదనపు బలగాలను రంగంలోకి దింపి కవాతు నిర్వహించడం ద్వారా ప్రజల్లో అభద్రత తొలగిస్తున్నారు. ఇదేసమయాన లైసెన్స్‌డ్ రివాల్వర్లు కలిగిన వారు వెంటనే వెనక్కి ఇచ్చేయాలని ఆదేశించారు. ఎన్నికల వేళ తుపాకులను దుర్వినియోగం చేయకుండా పోలీసులు ఈ చర్యలు చేపట్టారు.

జిల్లాలో 125 ఆయుధాలు
జిల్లాలో ఆయుధ లైసెన్స్ 125 మందికి ఉంది. ఇందులో రివాల్వర్లు, షార్ట్ రివాల్వర్లు, తుపాకులు ఉన్నాయి. గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయాన వీరంతా తుపాకులు వెనక్కి ఇవ్వగా.. ఎన్నికల కోడ్ ముగిశాక తిరిగి తీసుకున్నారు. మళ్లీ ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసుల సూచనల మేరకు పలువురు డిపాజిట్ చేయగా, మిగతా వారికి నోటీసులు జారీ చేశారు. అయితే, బ్యాంక్‌ల సెక్యూరిటీ సిబ్బంది మాత్రం ఆయుధాలు వెనక్కి ఇవ్వాల్సిన అవసరముండదు. కానీ వారు ఎన్ని తుపాకులు ఉన్నాయనే అంశంపై నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

ఎవరెవరు అర్హులు
ఎవరైనా సరే రక్షణ కోసం రివాల్వర్ పొందాలనుకుంటే తొలుత జిల్లా పోలీస్ ఉన్నతాధికారికి దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తు ఆధారంగా సదరు వ్యక్తి ప్రాణాలకు ముప్పు నిజమేనా, ఆయుధం అవసరమా అనే అంశంపై స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది విచారణ చేపడుతారు. ఒకవేళ వారికి నేరచరిత్ర ఉన్నా, ఎక్కడైనా పోలీసు కేసు నమోదైనట్లు తేలినా దరఖాస్తు తిరస్కరిస్తారు. అలాంటివేవీ లేకపోతే, ఆయుధం అవసరమని నిర్ధారణ జరిగితే నిబంధనల మేరకు లైసెన్స్ జారీ చేస్తారు. జిల్లాలో ఆయుధాలు కలిగి ఉన్న వారిలో పలువురు రాజకీయ నాయకులు, రియల్టర్లు ఉన్నారు.

కొనుగోలు.. డిపాజిట్ ఇలా..
ప్రతీ ఉమ్మడి జిల్లా కేంద్రంలో లైసెన్స్ కలిగిన వారికి ఆయుధాలు అమ్మేందుకు ఓ వ్యక్తికి పోలీసు శాఖ అనుమతి మంజూరు చేస్తుంది. పోలీస్ శాఖ ఇచ్చిన లైసెన్స్ ఆధారంగా సదరు వ్యక్తి రివాల్వర్లు విక్రయిస్తుంటారు. ఈమేరకు ఖమ్మంలో కూడా ఏళ్ల నుంచి ఒకే వ్యక్తి వీటిని విక్రయిస్తున్నాడు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యాన పోలీసులు నోటీసులు జారీ చేయగానే తుపాకులు కలిగి ఉన్న వారు వెంటనే ఈ స్టోర్‌లో డిపాజిట్ చేసి రశీదు తీసుకోవాలి. ఆపై స్టోర్ నిర్వాహకుడు ఎప్పటికప్పుడు డిపాజిట్ అయిన తుపాకుల వివరాలను సంబంధిత పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇస్తాడు. కాగా, లైసెన్స్ ఆయుధాలకు సంబంధించి వారి వెంట ఉన్న బుల్లెట్ల లెక్కలను కూడా ఎప్పటికప్పుడు పోలీస్ శాఖ పరిశీలిస్తుంది. ఒక్క బుల్లెట్ వాడినా పూర్తి వివరాలను పోలీసు శాఖకు తెలియపరచాలి. అలాకాకుండా నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తే తుపాకీ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు బాధ్యుడిపై కఠిన చర్యలు తీసుకుంటారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించండి

- జిల్లాలో 151 కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: యాసంగి ధాన్యం కొనుగోళ్లకు వచ్చేనెల 1వ తేదీలోగా కేంద్రాలను ప్రారంభించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో 151 కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఇందులో ఐకేపీ ద్వారా 28, పీఏసీఎస్‌ల ద్వారా 96, డీసీఎంఎస్ ద్వారా 27 కేంద్రాలు ఉంటాయని, వచ్చేనెల 1నుండి కేంద్రాలన్నీ అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆయా కేంద్రాలకు 1,71,357 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా ఉండగా, రైతులకు నీడ, తాగునీటి వసతి కల్పించడంతో పాటు గన్నీ బ్యాగులు, తూకం, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు సిద్ధం చేయాలని తెలిపారు. ఆపై ధాన్యం రవాణాకు కాంట్రాక్టర్లను ఎంపిక చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలాలు పరిరక్షించండి
ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం భూరక్షణ బృందాలతో ప్రభుత్వ స్థలాల పరిరక్షణపై సమీక్షించిన ఆయన మాట్లాడుతూ విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వ స్థలాల జాబితా ఆధారంగా తీసుకున్న చర్యలపై భూరక్షణ బృందాలు నివేదిక ఇవ్వాలన్నారు. జీఓ 59 ద్వారా క్రమబద్ధీకరణ కోసం అందిన దరఖాస్తుల్లో తిరస్కరణకు గురైన చోట స్థలాలు స్వాధీనం చేసుకోవాలని, వైఎస్సార్ కాలనీ, పువ్వాడ ఉదయ్‌నగర్‌లోని ఖాళీ ప్లాట్లతో పాటు టేకులపల్లి డబల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో లబ్ధిదారులు నివాసం లేని గృహాలను గుర్తించాలని సూచించారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు విజయనిర్మల, చందన్ కుమార్, శ్రీలత, అలీం, మురళీధర్‌రావు, సన్యాసయ్య, ఆఫ్రిన్, సునీత, జి.గణేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్
ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన మాస్టర్ ట్రెయినీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలన్నారు. ఇందు కోసం మే 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేలా పర్యవేక్షించే బాధ్యత కార్యాలయ అధికారులు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, డీఆర్వో రాజేశ్వరి, ఖమ్మం, కొత్తగూడెం ఆర్డీఓలు గణేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు కార్యాచరణ

మూడు రాష్ట్రాల ఎక్సైజ్ అధికారుల భేటీలో నిర్ణయం



సారపాకలో జరిగిన మావేశంలో పాల్గొన్న మూడు రాష్ట్రాల ఎక్సైజ్ అధికారులు

బూర్గంపాడు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యాన గంజాయి, మద్యం, నాటుసారా వంటి మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని ఎక్సైజ్ శాఖ ఉమ్మడి ఖమ్మం జిల్లా డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలోని ఐటీసీ సమావేశ మందిరంలో గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యాన మూడు రాష్ట్రాల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సరిహద్దు కలిగిన జిల్లాల ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ మద్యం, గంజాయి, నాటుసారా రాష్ట్రాలు దాటకుండా ఎక్కడికక్కడ నిఘా వేయాలని, బోర్డర్ చెక్‌పోస్టులను బలోపేతం చేయడంతో పాటు ఎన్నికలు ముగిసే వరకు తాత్కాలిక చెక్‌పోస్టులు సైతం ఏర్పాటు చేయాలని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపడితే మద్యం, గంజాయి రవాణాను అరికట్టవచ్చని తెలిపారు. రహదారుల మీదుగానే కాక పడవలపైనా తరలించకుండా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ గణేష్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం, ఏపీలోని ఏలూరు, ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, బీజాపూర్ జిల్లాల అధికారులు సూర్యచందర్‌రావు, రామకృష్ణ, గజేందర్, రాథోడ్, రాహుల్, కరంచంద్, రహీమున్నీషా, సాంబమూర్తి, పట్టాభి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యాన...
ఖమ్మంక్రైం: అంతర్రాష్ట్ర సరిహద్దు కలిగిన జిల్లాల పోలీసుల సమష్టి కృషి, సమాచార మార్పిడితో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షిస్తున్నట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, ఏపీలోని ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరి ప్రశాంతి తెలిపారు. ఎన్నికల నేపథ్యాన సరిహద్దుల మీదుగా మద్యం, నగదుఅక్రమ రవాణాను కట్టడి చేసేందుకు రెండు జిల్లాల అధికారులు గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సరిహద్దు చెక్‌పోస్టుల్లో 24గంటలు తనిఖీలు చేపట్టడంతో పాటు మద్యం, నగదుతో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అలాగే, నాన్ బెయిలబుల్ వారెంట్లు, పాత నేరస్తుల సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఖమ్మం అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఏసీపీలు రఘు, ప్రసన్నకుమార్, జంగారెడ్డిగూడెం, నూజివీడు డీఎస్పీలు రవిచందర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్య క్రతువు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆదాయం అదుర్స్..

- ఖమ్మం కార్పొరేషన్‌కు పెరిగిన ఆస్తిపన్ను
- రూ.32.81 కోట్లలో రూ.27.10 కోట్ల వసూలు
- కమిషనర్, రెవెన్యూ అధికారుల కృషితో ఫలితం
- మిగిలిన మూడు రోజుల్లో మొత్తం రాబట్టేలా చర్యలు

ఖమ్మంమయూరిసెంటర్: మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధికి ప్రజలు చెల్లించే పన్నులే ప్రధాన వనరులు. ఇందులో అత్యధికంగా ఆస్తి, నల్లా పన్నుల నుండే సమకూరుతుంది. ఈనేపథ్యాన కమిషనర్ ఆదర్శ్ సురభి, రెవెన్యూ అధికారుల కృషితో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఈ ఆర్థిక సంవత్సరం ఆదాయం పెరిగింది. గతేడాదితో పోలిస్తే పన్నుల వసూళ్లు పెరగగా.. బుధవారం నాటికి రూ.27.10 కోట్లు వసూలు చేసిన అధికారులు భేష్ అనిపించుకున్నారు.

గత ఏడాదితో పోలిస్తే పైకి..
కేఎంసీ పరిధిలో నివాస గృహాలు, వ్యాపార సముదాయాలు పెరుగుతుండడంతో ఏటా పన్ను డిమాండ్ పైపైకి వెళ్తోంది. గత ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నుల రూపంలో రూ.31 కోట్లు వసూలు చేయాలనేది లక్ష్యం కాగా, రూ.26.62 కోట్లు వసూలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం 79,420 అసెస్‌మెంట్ల సంబంధించి రూ.32.81 కోట్లు ఆస్తి పన్నులు వసూలు చేయాలని లక్ష్యం నిర్దేశించగా.. ఇప్పటివరకు రూ.27.10 కోట్లు వసూలు చేశారు.

పెరిగిన నల్లా పన్ను చెల్లింపులు
ఆస్తి పన్నుతో పాటు నల్లా పన్నుల బకాయిలను చెల్లించేందుకు సైతం నగర వాసులు ఆసక్తి చూపించారు. కేఎంసీ అధికారులు నోటీసులు జారీచేయడమే కాక పదేపదే కలిసి పన్ను చెల్లించాలని కోరుతుండడంతో యజమానులు ముందుకొచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరం కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆధ్వర్యాన నోటీసులు జారీ చేయడమే కాక సెల్ ఫోన్‌కు మెసేజ్‌లు పంపించగా, పలువురు చెల్లింపుపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఈనెల 27న(బుధవారం) ఒకేరోజు రూ.1.23 కోట్లు వసూలు కావడం విశేషం. ఇక గురువారం సాయంత్రానికి అందిన సమాచారం ప్రకారం రూ.80లక్షలు వసూలయ్యాయి. ఆన్‌లైన్‌లో జమ అయిన నగదు కూడా లెక్కిస్తే రూ.కోటి దాటే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

మూడు రోజులే..
ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మూడు రోజుల సమయమే ఉంది. దీంతో ఈ సమయంలో మిగతా పన్నులు కూడా వసూలు చేయాలనే లక్ష్యంతో అధికారులు కృషి చేస్తున్నారు. తద్వారా వంద శాతం వసూళ్లతో రికార్డు సృష్టించాలనే ఆలోచనలో ఉన్నారు.



పన్ను చెల్లించేందుకు గురువారం కేఎంసీలో క్యూ కట్టిన జనం

కేఎంసీ పరిధిలో పన్నుల వివరాలు

అసెస్‌మెంట్లు	79,420
డిమాండ్	రూ.32.81 కోట్లు
వసూలైన పన్నులు	రూ.27.10 కోట్లు
బకాయి	రూ.5.71 కోట్లు
మిగిలిన అసెస్‌మెంట్లు	41,310

క్లుప్తంగా

బీజేపీలో చేరిన రిటైర్డ్ పోలీసు అధికారి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో బోస్

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లా పోలీసు శాఖలో సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించి అసెంబ్లీ ఎన్నికలకు ముందు అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తూ స్వచ్ఛంద విరమణ చేసిన సుభాష్ చంద్రబోస్ బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లో గురువారం ఆయన కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షాన బీజేపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీలో చేరికలు ఉంటాయని, ఖమ్మం లోక్‌సభ స్థానాన్ని తాము కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

ఔషధ నియంత్రణ అధికారుల తనిఖీలు

అనుమతి లేని షాపులో రూ.2లక్షల విలువైన మందులు సీజ్



నిర్వాహకుడు, స్వాధీనం చేసుకున్న మందులతో అధికారులు

ఖమ్మం వైద్యవిభాగం/కారేపల్లి: జిల్లాలో గురువారం ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలు చేపట్టారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మందుల షాపులో సుమారు రూ.2 లక్షల విలువైన మందులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఔషధ నియంత్రణ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ జి.ప్రసాద్ మాట్లాడుతూ..సింగరేణి మండలం పొలంపల్లికి చెందిన ఈసాల రాజు లైసెన్స్ లేకుండా మందుల షాపు నడుపుతున్నట్లు గుర్తించి తనిఖీ చేశామన్నారు. ఈ సందర్భంగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వంటి 75 రకాల మందులు సుమారు రూ. 2లక్షల విలువైనవి సీజ్ చేసినట్లు తెలిపారు. సదరు వ్యక్తిపై డ్రగ్ కంట్రోల్ యాక్ట్ 1940 సెక్షన్ 18(సీ) కింద కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. తనిఖీల్లో ఖమ్మం రూరల్, కొత్తగూడెం, ఖమ్మం అర్బన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కె.దేవేందర్‌రెడ్డి, సీహెచ్.సంపత్, సీహెచ్.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

అటవీ అభివృద్ధి పనులపై విజిలెన్స్ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

సత్తుపల్లిటౌన్: భద్రాద్రి సర్కిల్ పరిధిలో జరుగుతున్న తనిఖీల్లో భాగంగా సత్తుపల్లి ఫారెస్ట్ డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను విజిలెన్స్ డీఎఫ్‌ఓ రాజశేఖర్, రేంజర్ నరేందర్ గురువారం పరిశీలించారు. గొల్లగూడెం, జగన్నాధపురం, చంద్రాయపాలెం, తాళ్లపెంట, గట్టుగూడెం ప్లాంటేషన్లను తనిఖీ చేయడంతో పాటు అభివృద్ధి పనుల రికార్డులను పరిశీలించి అడవుల్లోకి వెళ్లేందుకు నిర్మించిన రోడ్లు, చెక్‌డ్యాంలను పర్యవేక్షించారు. అలాగే, ప్లాంటేషన్లలో నాటిన మొక్కలపై ఆరా తీశారు. విజిలెన్స్ అధికారులు హుస్సేన్, సత్తుపల్లి ఎఫ్ఆర్‌ఓ స్నేహలత, శిల్ప, అరుణ, నాజర్, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌పై దాడి..

కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: రుణ కన్సల్టెన్సీల మోసాలపై కథనాలు ప్రచురించారంటూ ఓ జర్నలిస్ట్‌పై బుధవారం దాడి చేయగా ఆయన ఫిర్యాదుతో గురువారం ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... ఖమ్మంకు చెందిన నల్లి శ్యాంప్రసాద్ ఇటీవల ఆయన పనిచేస్తున్న పత్రికలో రుణ కన్సల్టెన్సీల మోసాలపై కథనాలు రాశాడు. దీంతో బుధవారం రాత్రి ఇంటికి వెళ్తుండగా ఖమ్మం ధంసలాపురం కొత్త కాలనీ అండర్ బ్రిడ్జి వద్ద గద్దల ప్రవీణ్ మరికొందరితో కలిసి కారులో వచ్చి ఢీకొట్టేందుకు యత్నించాడు. అనంతరం కిందకు దిగి శ్యాంప్రసాద్‌పై దాడికి యత్నించగా స్థానికులు రావడంతో వారు పరారయ్యారు. ఈమేరకు శ్యాం చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ స్వాధీనం

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలక నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. టిప్పర్ ద్వారా మట్టి తలిస్తున్నారనే సమాచారంతో గురువారం తనిఖీ చేయగా రేగులచెలకకు చెందిన ఎన్.హరీష్ టిప్పర్‌లో డ్రైవర్ వెంకటేశ్వర్లు మట్టి తరలిస్తూ పట్టుబడ్డాడు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని హరీశ్, వెంకటేశ్వర్లుతో పాటు వారిని ప్రోత్సహించిన ఉపేందర్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,045



కూలి పెరిగింది..

ఉపాధి కూలీలకు రూ.28 వేతనం పెంపు

- వచ్చేనెల 1 నుంచి అమలుకు కేంద్రం ఉత్తర్వులు
- ఉమ్మడి జిల్లాలో 5.51 లక్షల మందికి లబ్ధి

ఈ ఆర్థిక సంవత్సరం జిల్లాలో ఉపాధి పనుల వివరాలు

గ్రామపంచాయతీలు	589
జాబ్‌కార్డులు	3.06 లక్షలు
కూలీల సంఖ్య	6.46 లక్షలు
యాక్టివ్ జాబ్‌కార్డులు	1.9 లక్షలు
పనులకు వెళ్తున్న కూలీలు	3.2లక్షలు
ఈ ఏడాది వెచ్చించిన నిధులు	రూ.170.91 కోట్లు
కూలీల వేతనాలు	రూ.102.39 కోట్లు
సామగ్రి వ్యయం	రూ.55.45 కోట్లు

ఖమ్మంమయూరిసెంటర్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఈ వేసవి నుంచి వేతనం పెరగనుంది. వచ్చేనెల 1వ తేదీ నుంచి కొత్త వేతనం అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రోజుకు రూ.272గా అందుతున్న కూలీ రూ.300కు పెరుగుతుంది. ఈ నిర్ణయంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 5.51 లక్షల మంది కూలీలకు లబ్ధి చేకూరనుంది. అయితే కూలీలకు మూడేళ్లుగా వేసవిభత్యం ఇవ్వకపోగా.. ఈసారి కూలీ పెంపుతో సరిపెట్టారు.

లక్ష్యాలను నిర్దేశిస్తున్న కేంద్రం..

ఉపాధి హామీ పథకం నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొచ్చింది. ఇప్పటికే సాఫ్ట్‌వేర్‌ను పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుని పనిదినాల లక్ష్యాల కేటాయింపులను పర్యవేక్షిస్తోంది. పనులకు వచ్చే కూలీల సంఖ్య ఆధారంగా గ్రామం, మండలం, జిల్లాకు లక్ష్యాలను నిర్దేశిస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని పనిదినాలు పెంచేది. మూడేళ్లుగా ఈ లక్ష్యాల మేరకు కూలీలకు పనులు కల్పిస్తున్నారు.

వేతనం పెంపు..

ఉపాధి హామీ పథకంలో మార్పులు తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం ఏటా మాదిరిగానే 2024–25 ఆర్థిక సంవత్సరానికి కూలీల వేతనాలు పెంచుతూ నిర్ణయించింది. ఈమేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రూ.28 పెంచింది. గత ఆర్థిక సంవత్సరం రూ.15 మాత్రమే పెంచగా, ఈసారి ఇంకాస్త ఎక్కువ పెంచగా.. కొత్త వేతనం వచ్చేనెల 1వ తేదీ నుంచి అమలవుతుంది.

5.51 లక్షల మంది కూలీలకు లబ్ధి..

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు దొరకని సమయంలో ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీల సంఖ్య ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కువగానే ఉంటుంది. ఈ పనులను కూలీలు కుటుంబాల పోషణకు వినియోగించుకుంటున్నారు. కాగా, ఈ ఏడాది ఉపాధి పనులకు ఖమ్మం జిల్లాలో 3.20 లక్షల మంది వెళ్లగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2.31 లక్షల మంది వెళ్లినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

వేసవిభత్యం లేనట్టే?

కూలీలకు వేతనాలు పెంచిన ప్రభుత్వం ఈ ఏడాది కూడా వేసవిభత్యాన్ని ప్రస్తావించలేదు. ఏటా వేసవిలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కూలీలకు వేసవిభత్యం ప్రత్యేకంగా చెల్లించేవి. గతేడాది నుంచి ఇది అందకపోగా, ఈసారి కూడా మొండిచేయి చూపారు. అయితే, కూలీలకు తాగునీటి సరఫరా కోసం గ్రామపంచాయతీలకు నిధులను విడుదల చేస్తోంది. ఒక్కో కూలీకి రూ.2.50 చొప్పున కేంద్రం చెల్లించే నిధులతో పని ప్రదేశాల్లో తాగునీటి వసతి కల్పించాల్సి ఉంటుంది.

అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు కూల్చివేత

- నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని చర్యలు
- రూ.లక్షల్లో నష్టపోతున్నామని యజమానుల ఆందోళన



వైఎస్సార్ నగర్‌లో నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ నగర్‌లోని ఎక్స్ సర్వీస్‌మెన్ల స్థలాల్లో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టారంటూ గురువారం అధికారులు కూల్చివేతలకు దిగారు. ఖమ్మం అర్బన్ తహసీల్దార్, ఖమ్మం కార్పొరేషన్ అధికారుల ఆధ్వర్యాన ఖమ్మం అర్బన్ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు జరిగాయి. అయితే, ఎలాంటి సమాచారం లేకుండా అధికారులు, జేసీబీలతో చేరుకుని కూల్చివేతలు చేపట్టడంతో నిర్మాణదారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. తాము రూ.లక్షలు ధారపోసి స్థలాలు కొని నిర్మాణాలు చేపట్టామని, ఇప్పుడు చట్టవిరుద్ధమంటూ కూల్చివేయడం సరికాదని పేర్కొన్నారు. అయితే, అధికారులు ఇరవైకి పైగా నిర్మాణాలు, మరో ఇరవైకి పైగా బేస్‌మెంట్లను కూల్చివేశారు. కాగా, కలెక్టరేట్‌లో గురువారం మధ్యాహ్నం భూరక్షణ బృందాలతో ప్రభుత్వ స్థలాల పరిరక్షణపై కలెక్టర్ సమీక్షించిన గంటల వ్యవధిలోనే అధికారులు రంగంలోకి దిగడం గమనార్హం.

అసైన్డ్ భూముల్లో ఉండకపోవడంతోనే...

కూల్చివేతలపై ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్.స్వామి వివరాలు వెల్లడించారు. 1997, 2005 సంవత్సరాల్లో ఖానాపురం, వైఎస్సార్ కాలనీ, సర్వే నెంబర్ 37లో స్వాతంత్ర్య సమరయోధులు 439 మందికి 144 చదరపు గజాల చొప్పున ప్రభుత్వ స్థలాన్ని అసైన్ చేసినట్లు తెలిపారు. అందులో చాలా మంది ఉండకపోగా, ఇంకొందరు అమ్ముకున్నట్లు గుర్తించామన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం కావడంతో తిరిగి స్వాధీనం చేసుకోవడానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఆయా స్థలాలపై అభ్యంతరాలు ఉన్నవారు ఒరిజినల్ పట్టాలతో తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కాగా, బాధితులు మాత్రం ఖమ్మంలో సొంత ఇల్లు ఉండాలనే కలతో రూ.లక్షలు ధారపోసి కొనుగోలు చేస్తే ఇప్పుడు కూల్చివేయడం సరికాదంటూ ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

మల్టీపర్పస్ వర్కర్ ఆత్మహత్యాయత్నం

కార్యదర్శి పనిలోకి రావొద్దన్నాడని సెల్ఫీ వీడియో

కొణిజర్ల: పనిలోకి రావద్దన్నాడని, వస్తే పోలీస్ కేసు పెట్టి జైలుకు పంపిస్తానని పంచాయతీ కార్యదర్శి బెదిరించాడంటూ ఓ మల్టీ పర్పస్ వర్కర్ గురువారం సెల్ఫీ వీడియో తీసి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ వీడియోలో ఆయన వెల్లడించిన వివరాలు... కొణిజర్ల మండలం అంజనాపురానికి చెందిన భూక్యా ప్రసాద్ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు నెలలుగా వేతనం ఇవ్వకుండా కార్యదర్శి సురేష్ ఇబ్బంది పెడుతున్నాడని, అడిగితే పనికి రావొద్దు, ఇంకొకరిని పెట్టుకుంటానని చెబుతున్నాడని వాపోయారు. వైరా ఎమ్మెల్యేతో ఫోన్ చేయించినా..పట్టించుకోకుండా గురువారం ట్రాక్టర్ తీయడానికి వెళ్తే పోలీస్ కేసు పెట్టి జైలుకు పంపుతానని బెదిరించాడని పేర్కొన్నారు. దీంతో తాను పురుగుల మందు తాగుతున్నానని సెల్ఫీ వీడియోలో పేర్కొనగా.. స్థానికులు ఆయనను ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పంచాయతీ ప్రత్యేకాధికారి వేణును వివరణ కోరగా పంచాయతీ పాలకవర్గం ఉన్నప్పటి నుంచే ప్రసాద్ పనికి సరిగా వచ్చే వాడు కాదని, నిత్యం మద్యం మత్తులో ఉండే వాడని తెలిపారు. అలా ట్రాక్టర్ నడిపితే ప్రమాదాలు జరుగుతాయని వారిస్తే గొడవకు దిగడంతో కార్యదర్శి తనకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడని చెప్పారు. అయినా పొట్ట కొట్టొద్దనే ఉద్దేశంతోనే విధుల నుంచి తొలగించలేదని, ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

రుణం పేరుతో మోసగించిన ఇద్దరి అరెస్టు

- మరో ముగ్గురిపై కొనసాగుతున్న విచారణ
- హవాలా రూపంలో చేతులు మారిన రూ.కోట్ల నగదు
- డబ్బు ఆశతో ఏజెంట్లుగా మారిన నిందితులు
- చాకచక్యంగా కేసును ఛేదించిన ఇల్లెందు పోలీసులు

ఇల్లెందురూరల్: రుణం పేరుతో అమాయకులను బుట్టలో వేసుకుని.. వారి పేరిట బ్యాంకు అకౌంట్లు తెరిచి, హవాలా రూపంలో రూ.కోట్లు కాజేసిన ఇద్దరిని ఇల్లెందు పోలీసులు అరెస్ట్ చేశారు. ఇల్లెందుకు చెందిన ఐదుగురు మహిళల పేరుతో ఖాతాలు తెరిచిన ముఠా వారి అకౌంట్ల ద్వారా రూ.కోట్లలో లావాదేవీలు జరపడం, ఆ తర్వాత నిలిపివేయడాన్ని గమనించిన బ్యాంకు అధికారులు సదరు మహిళలను విచారించడంతో విషయం బయటపడింది. ఈ అంశంపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించగా రంగంలోకి దిగిన అధికారులు విచారణ చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు.

మోసం ఇలా..

దుబాయ్‌లో నివాసం ఉంటున్న సుధాకర్, అశోక్ గుప్తా.. ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడుకు చెందిన కస్యా చిన్నబాబు అలియాస్ హర్షకు ఫోన్ చేసి ట్రేడింగ్ చేయడానికి కరెంట్ బ్యాంకు ఖాతా కావాలని చెప్పారు. ఈ ఖాతా తెరిస్తే రూ.50వేలు ఇస్తామని చెప్పడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖమ్మం గాంధీచౌక్ శాఖలో లోన్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న హర్ష డబ్బుకు ఆశపడి తన భార్య ప్రియాంక పేరిట ఖాతా తెరిచాడు. ఆతర్వాత దుబాయ్‌లో ఉంటున్న వ్యక్తులు మళ్లీ ఫోన్ చేయడంతో ఇల్లెందు వాస్తవ్యురాలైన తన భార్య స్నేహితుడైన చైతన్య అనే వ్యక్తికి డబ్బు ఆశ చూపాడు. దీంతో ఆయన పొదుపు సంఘాల మహిళలు ఐదుగురికి రూ.15వేలు రుణం ఇప్పిస్తానంటూ ఖాతాలు తెరిపించి వివరాలను దుబాయ్‌లో ఉన్నవారికి పంపించాడు. అందుకుగాను చైతన్యకు రూ.లక్ష నగదు ఇవ్వగా.. ఆయన ఐదుగురు మహిళలకు రూ.15వేల చొప్పున ఇచ్చి మిగతా రూ.25వేలు తీసుకున్నాడు. ఆ తర్వాత ఐదు ఖాతాల ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఏటీఎం కార్డు వివరాలను దుబాయిలో ఉన్న సుధాకర్, అశోక్ హవాలా రూపంలో లావాదేవీలను కొనసాగించారు. ఇలా రూ.3.80కోట్ల మేర లావాదేవీలు జరిగాయి.

చాకచక్యంగా ఛేదించిన పోలీసులు

పెద్దమొత్తంలో నగదు లావాదేవీలపై అందిన ఫిర్యాదుతో ఇల్లెందు పోలీసులు విచారణ చేపట్టగా.. దుబాయి కేంద్రంగా దందా నడిపిస్తున్న సుధాకర్, అశోక్ బండారం బయటపడింది. ఇండియాలోని పలువురు వ్యాపారులను వాట్సాప్ గ్రూపు ద్వారా పరిచయం చేసుకుని క్రిప్టో కరెన్సీ బిట్ కాయిన్ల పెట్టుబడి పెడితే చాలా రెట్లు కలిసొస్తాయని నమ్మబలుకుతూ ముందుకొచ్చిన వారి నుంచి మహిళల ఖాతాల్లో నగదు జమ చేయించారు. అనంతరం ఆ నగదును దుబాయ్‌కి బదిలీ చేసుకుని అక్కడ విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. గతంలో ఇదే తరహాలో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడిన వారిపై హైదరాబాద్ ఎల్బీనగర్ పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదైనట్లుగా తేలింది. ఈ మేరకు నిందితుల్లో చైతన్య, హర్షను ఇల్లెందు సీఐ కరుణాకర్ నేతృత్వాన అరెస్టు చేసినట్లు భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ వివరించారు. మిగిలిన వారిపై కూడా విచారణ సాగుతున్నట్లు తెలిపారు.

నిలిచిన బార్ అసోసియేషన్ ఓట్ల లెక్కింపు

ఖమ్మం లీగల్: ఖమ్మం బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికకు గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9నుంచి సాయంత్రం 4.30గంటల వరకు పోలింగ్ నిర్వహించగా 946 ఓట్లలో 757 ఓట్లు పోలయ్యాయి. ఆతర్వాత ఓట్లు లెక్కించాల్సి ఉండగా... రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాలతో నిలిపివేశారు. మళ్లీ వచ్చే ఆదేశాల ఆధారంగా న్యాయవాదుల సమక్షాన ఓట్లు లెక్కించి ఫలితం వెల్లడిస్తామని ఎన్నికల అధికారి మారగాని శ్రీనివాసరావు తెలిపారు.

ఎస్సై డ్రైవర్‌ను అంటూ బురిడీ

బంక్ నుంచి రూ.15 వేలతో ఉడాయింపు

కూసుమంచి: 'నేను ఎస్సై డ్రైవర్‌ను, ఎస్సై గారి వద్ద రూ.100 నోట్లు 150 ఉన్నాయి. వాటికి బదులు రూ.500 నోట్లు కావాలి'అంటూ వచ్చిన ఓ యువకుడు కూసుమంచి పెట్రోల్ బంక్ ఆపరేటర్ వద్ద రూ.15వేలు తీసుకుని ఉడాయించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఓ యువకుడు ఉదయం బంక్‌కు హోండా యాక్టివాపై వచ్చాడు. అక్కడ ఉన్న ఆపరేటర్ బదావత్ మహిపాల్‌తో తనను ఎస్సై డ్రైవర్‌గా పరిచయం చేసుకుని.. ఎస్సై వద్ద ఉన్న రూ.100నోట్లకు బదులు రూ.500 నోట్లు తీసుకురమ్మని పంపించాడని చెప్పాడు. దీంతో నమ్మిన మహిపాల్ ఆయనకు 30 రూ.500 నోట్లు ఇచ్చి రూ.100నోట్లు అడగగా, కాసేపట్లో తీసుకొస్తానంటూ వెళ్లిపోయాడు. సదరు యువకుడు ఎంతకూ తిరిగి రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన ఆపరేటర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, నిందితుడు వచ్చిన హోండా యాక్టివా ఖమ్మం గాంధీ చౌక్ ప్రాంతం నుంచి దొంగిలించినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు గాలింపు చేపట్టారు.

ట్రాక్టర్ కింద పడి రైతు మృతి



నర్సిరెడ్డి (ఫైల్)

మధిరరూరల్: పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ రోటవేటర్‌లో తల పడడంతో రైతు మృతి చెందాడు. వివరాలు... మధిర మండలం నిధానపురానికి చెందిన రైతు అమరవాది నర్సిరెడ్డి (58) ఐదెకరాల భూమి కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేశాడు. పంట పూర్తి కావడంతో పొలంలో మిరప కట్టె తొలగించేందుకు ట్రాక్టర్‌కు రోటవేటర్ బిగించుకుని వెళ్లాడు. ఈక్రమంలోనే రోటవేటర్‌లో ఇరుక్కున్న మిరప కట్టె తొలగించే క్రమాన ప్రమాదవశాత్తు రోటవేటర్ కింద పడ్డాడు. సమీపంలో ఉన్న రైతులు గమనించి చేరుకునే సరికి నర్సిరెడ్డి తల ముక్కలై మృతి చెంది ఉన్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా.. ఘటనపై మధిర రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అగ్నిప్రమాదంలో కిరాణం షాప్ దగ్ధం



షాపులో చెలరేగుతున్న మంటలు

కారేపల్లి: మండలంలోని చర్లపల్లిలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో కిరాణం షాపు కాలిపోగా, సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. గ్రామానికి వల్లభనేని రమేష్ కిరాణం దుకాణంలో మంటలు చెలరేగగా నూనె ప్యాకెట్లు, ఇతర సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. షార్ట్ సర్క్యూట్‌తోనే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. అయితే, స్థానికులు ఎంత ప్రయత్నించినా మంటలు ఆరకపోవడంతో అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వగా, చాలాసేపటి వరకు ఫైర్ ఇంజన్ రాలేదు. ఈమేరకు సమాచారం అందుకున్న కారేపల్లి ఆర్ఐ జార్జీ పరిశీలించి పంచనామా నిర్వహించారు.

ఉరి వేసుకొని ఆటోడ్రైవర్ ఆత్మహత్య

చుంచుపల్లి: మండలంలోని బాబుక్యాంప్ వ్యాయామశాల ఎదురుగా నివాసం ఉంటున్న ఓ ఆటో డ్రైవర్ ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడగా.. గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మూడు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మనోహర్ (45) ఉరివేసుకొని చనిపోయాడు. అతడు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండగా.. ఆర్థిక ఇబ్బందులే కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మనోహర్ ఉరి వేసుకోగా.. మూడు రోజులుగా తలుపులు తెరవకపోవడంతో చుట్టుపక్కల ప్రజలకు ఆ ఇంట్లో నుంచి దుర్వాసన వెదజల్లడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా మనోహర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

త్యాగమయుడు.. క్రీస్తు

- నేడు గుడ్ ఫ్రైడే..
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు
- క్రీస్తు సిలువ ఘట్టాలపై కార్యక్రమాలు



ఖమ్మంగాంధీచౌక్: ఏసుక్రీస్తు సిలువపై ప్రాణాలర్పించిన రోజును క్రైస్తవులు గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటారు. ఈమేరకు శుక్రవారం జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు సిద్ధం కాగా.. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. మానవాళి చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తంగా తన ప్రాణాలను సిలువపై పణంగా పెట్టాడని క్రైస్తవుల నమ్మిక. జీసస్‌ను సిలువపై వేలాడదీసిన రోజు శుక్రవారం కావడంతో గాడ్స్ ఫ్రైడేగా జరుపుకుంటుండగా.. ఆ పదం నుంచే గుడ్ ఫ్రైడే వచ్చిందని చెబుతారు. కొందరు ఈ రోజును బ్లాక్ ఫ్రైడేగా కూడా పిలుచుకుంటారు. శత్రువులను కూడా ప్రేమతో క్షమించాలని బోధించిన మహనీయుడిగా, ప్రేమమూర్తిగా, లోక రక్షకుడిగా క్రైస్తవులు యేసును ప్రార్థిస్తారు. ఈ రోజు ఉపవాసం ఉండి ఏసుక్రీస్తును తలుచుకుంటూ చర్చిల్లో ప్రార్థన చేయడంతో పాటు చర్చిల్లో 33 సార్లు గంట మోగిస్తారు. అలాగే, పాపాల నుంచి క్షమాపణ కోరుతూ ప్రాయశ్చిత్తంగా నలభై రోజులపాటు ఉపవాస దీక్ష చేసిన క్రైస్తవులు శుక్రవారం తమ దీక్షను ముగిస్తారు. ఇక ఏసుప్రభువు మూడో రోజైన ఆదివారం తెల్లవారుజామున భక్తులకు దర్శనమిస్తాడని ప్రతీతి. ఈమేరకు ఆదివారం ఈస్టర్ (పునరుత్థాన పండుగ) జరుపుకోనుండగా.. ఈ మూడు రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.

ప్రదర్శనలు, ర్యాలీలు..

ఏసుక్రీస్తు మరణంపై గుడ్ ఫ్రైడే రోజున క్రైస్తవులు ప్రత్యేకంగా ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహిస్తారు. ఏసు వేషధారణ, సిలువ వేసిన తీరును ప్రతిబింబించేలా ప్రదర్శనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని ఆర్‌సీఎం, సీఎస్ఐ, గుడ్ షఫర్డ్ తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనుండగా.. ఖమ్మం వైరారోడ్డులోని ఆర్‌సీఎం చర్చిలో ఏటా ప్రత్యేకంగా సిలువధారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఒకేరోజు ఏడు అబార్షన్లు

- సుగుణ ఆస్పత్రి నిర్వాహకుల తీరు
- తప్పుడు వివరాలతో కేస్‌షీట్లు.. ఆపై గర్భవిచ్ఛిత్తి
- అధికారుల తనిఖీల్లో గుర్తింపు, ఆస్పత్రి సీజ్



గర్భిణిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ఖమ్మంవైద్యవిభాగం: అబార్షన్లు నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారంతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు జిల్లా కేంద్రంలోని చర్చి కాంపౌండ్ వద్ద ఉన్న సుగుణ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతితో పాటు అసిస్టెంట్ కలెక్టర్ యువరాజు, ట్రెయినీ ఐపీఎస్ మౌనిక పాల్గొనగా.. అబార్షన్లు చేసింది నిజమేనని తేలడంతో ఆస్పత్రిని సీజ్ చేశారు. ఆస్పత్రిలో గురువారం ఉదయం ఐదుగురికి అబార్షన్ చేయగా, రాత్రి 8 గంటల సమయంలో మరో ఇద్దరికి చేస్తున్నట్లుఅందిన సమాచారంతో తనిఖీ నిర్వహించామని డీఎంహెచ్‌ఓ తెలిపారు.

తప్పుడు వివరాలతో...

అధికారులు తనిఖీ చేసిన సమయాన ఆస్పత్రిలో రెండు నెలలు, 18వారాల గర్భిణులు ఉన్నారు. అయితే, వారి పేర్లు ఎక్కడా నమోదు చేయకపోగా, కేస్‌సీట్లు జారీ చేసినా ఇతరుల పేర్లతో, కడుపు నొప్పి తదితర కారణాలు పేర్కొన్నారు. అంతేకాక కేస్‌షీట్లపై పేర్లు కాకుండా కోడ్ భాషలో రాశారు. ఈసందర్భంగా సుమారు 50 వరకు అబార్షన్లకు సంబంధించి కేస్‌షీట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీరిలో చాలామంది కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, కొత్తగూడెం ప్రాంతాల వారిగా గుర్తించారు. ఈమేరకు స్కానింగ్ యంత్రం, కంప్యూటర్లు, సీసీ కెమెరాల పుటేజీని స్వాధీనం చేసుకుని ఆస్పత్రిని సీజ్ చేశారు. అధికారులు తనిఖీకి వెళ్లిన సమయాన ఉన్న ఇద్దరు గర్భిణులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, తనిఖీల్లో ఔషధ నియంత్రణ శాఖ అధికారులు కూడా పాల్గొని అబార్షన్‌కు ఉపయోగిస్తున్న మందులను స్వాధీనం చేసుకున్నారు.

కీచక గురువు

- విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన హెచ్‌ఎం
- కేసు నమోదుపై మహిళా ఎస్సై తాత్సారం

మధిర: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురువు తన బాధ్యతను మరిచి అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఘటన ఇది. మధిర మున్సిపాలిటీ పరిధి మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు సాధు సమాధానం 9, 10వ తరగతుల విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తుండగా.. ఈనెల 27న(బుధవారం) సైతం ఇదే విధంగా వ్యవహరించడంతో విద్యార్థినులు వారి తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో ఓ విద్యార్థిని తల్లి హెచ్‌ఎంను ప్రశ్నించడమే కాక అదేరోజు సాయంత్రం మధిర టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే వివరాలు ఆరా తీసిన ఎస్సై సంధ్య కేసు నమోదు చేయలేదు. ఈమేరకు విషయాన్ని విద్యార్థినుల తల్లిదండ్రులు గురువారం హెచ్‌ఎం తీరును విలేకరులకు వివరించారు. ఈ అంశంపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో మధిర ఎంఈఓ వై. ప్రభాకర్ మడుపల్లి పాఠశాలకు వెళ్లి ఆరా తీశారు. అయితే, ఆరోపణలు ఎదుర్కొంటున్న హెచ్‌ఎం సాధు సమాధానం ఎర్రుపాలెంలో ఎస్సెస్సీ ఇన్విజిలేషన్‌కు వెళ్లడంతో ఆయనను విచారించలేదని ఎంఈఓ తెలిపారు. కాగా, హెచ్‌ఎంపై కేసు నమోదు చేయాలని బాధిత విద్యార్థిని తల్లి గురువారం కూడా టౌన్ ఎస్సైకు ఫిర్యాదు చేశారు.

వెంట తీసుకురండి.. కేసు పెడతా..

బాధిత విద్యార్థిని తన తల్లితో కలిసి మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసిన నేపథ్యాన కేసు నమోదు చేశారా అని ఎస్సై సంధ్యను 'సాక్షి'ఫోన్‌లో గురువారం ఆరా తీయగా, 'నాకు ఫిర్యాదు ఇవ్వలేదు, మీరు వెంటబెట్టుకుని రండి ప్పుడు కేసు కడతాను'అని చెప్పడం గమనార్హం. ఇలా సమాధానం ఇవ్వడమేమిటని ప్రశ్నిస్తుండగానే ఫోన్ కట్ చేశారు. మళ్లీ ఫోన్ చేస్తే సిబ్బందికి ఇచ్చి మేడం మీటింగ్‌లో ఉన్నారని చెప్పించారు. ఆతర్వాత సీఐతో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఫోన్ కట్ చేయగా, వైరా ఏసీపీకి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

Complete B.A / B.com / B.Sc / BBA / M.A/M.com / M.Sc / MBA / MCA / B.Tech / Diploma / D.ఫార్మసీ /B.ఫార్మసీ / BAMS / BHMS in 6 months ✆ 95504 43817 [B.190781]

Real Estate

PLOT FOR SALE

ఖమ్మం మెయిన్ రోడ్డు, శ్రీశ్రీ సర్కిల్ దగ్గర కమర్షియల్ 4వ ప్లాట్ 385 గజాలు అమ్మకానికి కలదు. వివరాలకు సంప్ర. సెల్ : 80966 14489. [M-1233888]

ఖమ్మం 3 టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్, గాంధీ నగర్‌లో 275 గజాల స్థలం అమ్మకానికి కలదు. వివరాలకు సంప్రదించండి. సెల్ : 83281 02880. [M-1185005]

Services

BUSINESS OFFER

కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1252718]

Wanted

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మా సర్వీస్ నందు పనిచేయుటకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్ & శానిటరీ, A/c టెక్నీషియన్స్ వెంటనే కావలెను. సంప్ర॥ 8074489455. [M-1185008]

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185009]

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182
9010299957
కొత్తగూడెం : 9010223783

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
655	203
73,651	22,327

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,381	▼ 19
డోజోన్స్	39,765	▲ 4
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,953	▲ 21
డాక్స్	18,492	▲ 15
షాంఘై	3,110	▲ 18
నికాయ్	40,168	▼ 595

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	66,760	▲ 126
బంగారం (99.5 స్వచ్ఛత)	66,691	▲ 125
వెండి (కేజీ)	74,747	▲ 250

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.93	83395
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.32	106.84
€	యూరో	ఎస్‌బీఐ	89.25	90.68
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.34	56.14
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.54	55.75
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.34	64.75
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.28	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.69	23.55
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.47

చేతులు కలిపిన అంబానీ- అదానీ

అదానీ పవర్ ప్రాజెక్టులో రిలయన్స్‌కు 26 శాతం వాటా



న్యూఢిల్లీ: బిలియనీర్ పారిశ్రామిక దిగ్గజాలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ తొలిసారి చేతులు కలిపారు. దీనిలో భాగంగా అదానీ పవర్‌కు చెందిన పవర్ ప్రాజెక్టులో రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) 26 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. అంతేకాకుండా మధ్యప్రదేశ్‌లోని ఈ ప్లాంటుకు చెందిన 500 మెగావాట్ల యూనిట్‌లో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఆర్ఐఎల్ సొంత అవసరాలకు వినియోగించుకునేందుకు రెండు సంస్థలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. వెరసి అదానీ పవర్ పూర్తి అనుబంధ సంస్థ మహాన్ ఎనర్జెన్ లిమిటెడ్‌లో 5 కోట్ల ఈక్విటీ షేర్లను ఆర్ఐఎల్ సొంతం చేసుకోనుంది. రూ. 10 ముఖ విలువకే(రూ. 50 కోట్లు) వీటిని చేజిక్కించుకోవడంతోపాటు.. 500 మెగావాట్ల విద్యుత్‌ను సొంత అవసరాలకు ఆర్ఐఎల్ వినియోగించుకోనుంది. సొంత వినియోగ పాలసీలో భాగంగా ఆర్ఐఎల్ 20 ఏళ్ల దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని(పీపీఏ) ఎంఈఎల్‌తో కుదుర్చుకున్నట్లు అదానీ పవర్ వెల్లడించింది. మొత్తం 2,800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ సామర్థ్యంతో ఏర్పాటవుతున్న ఎంఈఎల్ ప్లాంటులో 600 మెగావాట్ల యూనిట్‌ను సొంత అవసరాల పద్ధతిలో తెరతీయనున్నట్లు వివరించింది.

అదానీ గ్రూప్ ప్రపంచ అతిపెద్ద కాపర్ ప్లాంట్



గుజరాత్‌లోని ముంద్రాలో అదానీ గ్రూప్ భారీ కాపర్ ప్లాంటు తొలి దశను ప్రారంభించింది. ఇది ప్రపంచంలోనే సింగిల్ లొకేషన్‌లో ఏర్పాటైన అతి పెద్ద కాపర్ తయారీ కర్మాగారంగా నిలవనుంది. దీనితో దిగుమతులపై ఆధారపడే పరిస్థితి కొంత తగ్గనుంది.

అంబుజాలో అదానీ వాటా అప్

రూ. 6,661 కోట్ల పెట్టుబడులు

డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ తాజాగా అంబుజా సిమెంట్స్‌లో వాటాను పెంచుకుంది. 21.2 కోట్ల వారంట్లను ఈక్విటీ షేర్లుగా మార్పిడి చేసుకోవడం ద్వారా 3.6 శాతం అదనపు వాటాను పొందింది. ఇందుకు రూ. 6,661 కోట్లు వెచ్చించగా.. ప్రస్తుతం అంబుజాలో అదానీ వాటా 66.7 శాతానికి చేరింది. దేశీయంగా సిమెంట్ తయారీలో రెండో పెద్ద కంపెనీగా నిలుస్తున్న అంబుజాలో ప్రమోటర్ సంస్థ హార్మోనియా ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ షేరుకి రూ. 314.15 సగటు ధరలో వారంట్లను మార్పిడి చేసుకుంది. ఇంతక్రితం 2022 అక్టోబర్‌లోనూ ప్రమోటర్ సంస్థ వారంట్లను అందుకోవడం ద్వారా రూ. 5,000 కోట్లు ఇన్వెస్ట్ చేసిన విషయం విదితమే. దీనిలో భాగంగా హార్మోనియాకు 47.74 కోట్ల మార్పిడికి వీలయ్యే వారంట్లను అంబుజా సిమెంట్స్ జారీ చేసింది.

చిన్న పొదుపులపై వడ్డీరేట్లు యథాతథం



న్యూఢిల్లీ: చిన్న పొదుపులపై వడ్డీరేట్లు ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో జనవరి–మార్చి తరహాలోనే యథాతథంగా కొనసాగనున్నాయి. వీటిలో ఎటువంటి మార్పూ ఉండబోదని కేంద్రం ప్రకటించింది. ప్రకటన ప్రకారం సురక్ష సమృద్ధి యోజనపై 8.2% వడ్డీరేటు అమలవుతుంది. మూడేళ్ల టర్మ్ డిపాజిట్‌పై వడ్డీ రేటు 7.1%. పీపీఎఫ్‌పై వడ్డీ 7.1 శాతంకాగా, పోస్టాఫీస్ సేవింగ్స్ డిపాజిట్ స్కీమ్‌పై 4% వడ్డీ అమలవుతుంది. కిసాన్ వికాస పత్రపై 7.5% వడ్డీ లభిస్తుంది. ఇన్వెస్ట్‌మెంట్ మెచ్యూరిటీ కాలం 115 నెలలు. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌పై వడ్డీ 7.7%. నెలవారీ ఆదాయ పథకంపై 7.4% వడ్డీ లభిస్తుంది.

ఫిబ్రవరిలో మౌలికం నెమ్మది



న్యూఢిల్లీ: ఎనిమిది కీలక పరిశ్రమలతో కూడిన భారత్ మౌలిక రంగం ఫిబ్రవరిలో 6.7 శాతం పురోగమించింది. 2023 ఇదే నెల్లో ఈ వృద్ధి రేటు 7.4 శాతం. అయితే జనవరితో పోల్చితే (4.1 శాతం) గ్రూప్ పురోగమించడం గమనార్హం. సమీక్షా నెల్లో ఎరువుల రంగంలో వృద్ధిలేకపోగా, క్షీణ రేటు నమోదయ్యింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి వరకూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రూప్ పురోగతి గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చిచూస్తే 8.2% నుంచి 7.7 శాతానికి తగ్గింది. ఎరువులుసహా బొగ్గు, క్రూడ్ ఆయిల్, సహజ వాయువు, రిఫైనరీ ప్రొడక్టులు, స్టీల్, సిమెంట్, ఎలక్ట్రిసిటీ రంగాలు ఉన్నాయి. పారిశ్రామిక ఉత్పత్తిలో వీటి వెయిటేజ్ 42 శాతం.

కొటక్ బ్యాంక్ చేతికి సొనాటా ఫైనాన్స్



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం కొటక్ మహీంద్రా బ్యాంక్ తాజాగా ఎస్‌బీఎఫ్‌పీ.. సొనాటా ఫైనాన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌ను కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 537 కోట్లు వెచ్చించింది. 549 బ్రాంచీల ద్వారా సొనాటా 10 రాష్ట్రాలలో కార్యకలాపాలు విస్తరించింది. ఆర్‌బీఐ రిజిస్టర్డ్ మైక్రోఫైనాన్స్ సంస్థ సొనాటా నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) సుమారు రూ. 2,620 కోట్లు కాగా.. 100 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు కొటక్ బ్యాంక్ పేర్కొంది. దీంతో సొనాటా పూర్తి అనుబంధ సంస్థగా ఆవిర్భవించినట్లు వెల్లడించింది.

ఈ వార్తల నేపథ్యంలో కొటక్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 0.6 శాతం బలపడి రూ. 1,786 వద్ద ముగిసింది.

ఆర్థిక సంవత్సరానికి
లాభాలతో గుడ్ బై...

- సెన్సెక్స్ 655 పాయింట్లు ప్లస్
- 22,250 స్థాయి పైకి నిఫ్టీ
- గుడ్‌ఫ్రైడే సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు

ముంబై: ఆర్థిక సంవత్సరం చివరి రోజైన గురువారం స్టాక్ సూచీలు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 655 పాయింట్లు పెరిగి 73,651 వద్ద ముగిసింది. నిఫ్టీ 203 పాయింట్లు బలపడి 22,327 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి మీడియా మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 1,194 పాయింట్లు పెరిగి 74,190 వద్ద, నిఫ్టీ 392 పాయింట్లు బలపడి 22,516 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. స్టాక్ మార్కెట్ సంబంధించి ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతో పాటు ఫారెక్స్ మార్కెట్లో బలహీనతల కారణంగా ఆఖర్లో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. దీంతో సూచీలు కొంతమేర ఆరంభ లాభాలు కోల్పోయాయి. సెన్సెక్స్ దాదాపు ఒకశాతం లాభపడటంతో బీఎస్ఈలో రూ.3.33 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.

నేడు ఎక్స్ఛేంజీలకు గుడ్‌ఫ్రైడే సెలవు. శని, ఆదివారాలు సాధారణ సెలవులు రోజులు కావడంతో ట్రేడింగ్ సోమవారం ప్రారంభం అవుతుంది.

- సెన్సెక్స్ 30 షేర్లలో యాక్సిస్ బ్యాంక్ (0.50%), రిలయన్స్ (0.37%), హెచ్‌సీఎల్ (0.26%), టెక్ మహీంద్రా (0.25%) మాత్రమే నష్టపోయాయి. మిగిలిన 26 షేర్లూ లాభపడ్డాయి.
- బీఎస్ఈ, నిఫ్టీలు ఎంపిక చేసుకున్న షేర్లలో బీటా వెర్షన్ టీ+0 ట్రేడ్ సెటిల్‌మెంట్‌ను ప్రారంభించాయి. తొలి రోజున రెండు ఎక్స్ఛేంజీల్లో 60 మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు.

ర్యాలీ ఎందుకంటే

ప్రత్యామ్నాయ పెట్టుబడి ఫండ్ల(ఏఐఎఫ్)లో రుణదాతల పెట్టుబడులపై గతంలో కఠిన ఆంక్షల విధించిన ఆర్‌బీఐ తాజాగా నిబంధనలను సులభతరం చేయడంతో అధిక వెయిటేజీ ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులతో పాటు ఫైనాన్స్ రంగాల షేర్లు రాణించాయి. మోర్గాన్ స్టాన్లీ వచ్చే ఆర్థిక సంవత్సరానికి గానూ భారత వృద్ధి అవుట్‌లుక్‌ను 6.5 శాతం నుంచి 6.8 శాతానికి అప్‌గ్రేడ్ చేసింది. ఇటీవల ఎఫ్ఐఐలు భారత ఈక్విటీల పట్ల కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. అమెరికా సూచీలు రికార్డు స్థాయిల్లో ట్రేడవుతున్నాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు 0.5% పెరిగాయి.

2023- 24లో రూ.128 లక్షల కోట్ల సృష్టి

దేశీయ స్టాక్ మార్కెట్ 2023–24లో గణనీయమైన లాభాలు పంచింది. సెన్సెక్స్ 14,660 పాయింట్లు (25%) ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో కంపెనీల మొత్తం విలువ ఏడాది వ్యవధిలో 128 లక్షల కోట్లు పెరిగి రూ.387 లక్షల కోట్లు చేరింది. సెన్సెక్స్ మార్చి 7న 74,245 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. మార్చి 2న ఇన్వెస్టర్ల సంపద సైతం రూ.394 లక్షల వద్ద ఆల్‌టైం హైని తాకింది. ఇదే కాలంలో నిఫ్టీ 4,967 పాయింట్లు(29%) పెరిగింది. మార్చి 11న 22,526 వద్ద చరిత్రాత్మక గరిష్టాన్ని అందుకుంది. 2022–23లో 423 పాయింట్లు పెరిగినప్పటికీ ఇన్వెస్టర్లకు రూ. 5.86 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది.



ఐసీఐసీఐ సెక్యూరిటీస్ డీలిస్టింగ్

స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి డీలిస్ట్ చేసేందుకు 72 శాతం వాటాదారులు అనుమతించినట్లు ఐసీఐసీఐ సెక్యూరిటీస్ తాజాగా వెల్లడించింది. అయితే రిటైల్ ఇన్వెస్టర్లు ఈ పథకాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది. డీలిస్టింగ్ తదుపరి మాతృ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్‌లో విలీనంకానున్నట్లు తెలియజేసింది. డీలిస్టింగ్ పథకంలో భాగంగా ఐసీఐసీఐ సెక్యూరిటీస్ వాటాదారులు తమ వద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 67 ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లను పొందనున్నట్లు వెల్లడించింది.

కార్వీకి సెబీ మరో షాక్

కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్ లిమిటెడ్‌కు సెబీ మరో షాక్ ఇచ్చింది. అర్హత ప్రమాణాలను ఉల్లంఘించినందుకు మర్చంట్ బ్యాంకర్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. 2023 మార్చి 15–17 తేదీల్లో కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్‌ను సెబీ బృందం తనిఖీల నేపథ్యంలో తాజా నిర్ణయం తీసుకుంది. గతంలోనూ సెబీ కార్వీపై పలు చర్యలు తీసుకున్న సంగతి విదితమే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-3-2024	
విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400-00
విజయవాడ	400-00
రిటైల్ ధర (డజను)	72.00
29-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	375-00
వరంగల్	377-00
రిటైల్ ధర	4.35

టయోటా వాహనాలు కాస్త ప్రియం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టయోటా మోటార్ ఎంపిక చేసిన మోడళ్లపై 1 శాతం వరకు ధరలు పెంచనుంది. ఏప్రిల్ 1 నుంచి సవరించిన ధరలు అమలులోకి రానున్నాయని కంపెనీ గురువారం ప్రకటించింది. తయారీ, నిర్వహణ వ్యయాలు అధికం అవుతున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. టయోటా తయారు చేస్తున్న మోడళ్ల ధర ఎక్స్‌షోరూంలో రూ.6.86 లక్షలు మొదలుకుని రూ.51.44 లక్షల వరకు ఉంది.

భారత్‌లో ఐఏఐ అనుబంధ సంస్థ ఏర్పాటు



న్యూఢిల్లీ: ఏరోస్పేస్, రక్షణ రంగ దిగ్గజం ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) భారత్‌లో తమ అనుబంధ సంస్థ ఏరోస్పేస్ సర్వీసెస్ ఇండియా (ఏఎస్ఐ)ని ప్రారంభించింది. మేక్ ఇన్ ఇండియా లక్ష్య సాధనలో పాలుపంచుకోవడంపై తమ నిబద్ధతకు ఇది నిదర్శనమని ఏఎస్ఐ సీఈవో డ్యానీ లాబర్ తెలిపారు. భారతీయ సాయుధ బలగాల కోసం అధునాతన సిస్టమ్స్‌ను అభివృద్ధి చేసే దిశగా ఏఐఏ, డీఆర్‌డీవో మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావడానికి ఇది దోహదపడగలదని వివరించారు.

జిల్లా వార్తలు

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు అందజేస్తున్న ఆలయ ఉద్యోగి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి భద్రాచలానికి చెందిన భక్తులు గురువారం విరాళం అందజేశారు. పట్టణంలోని తాతగుడి సెంటర్‌కు చెందిన గుండేల వెంకటేశ్వరరావు–రత్నకుమారి దంపతులు రూ.2 లక్షలను వితరణ చేయగా.. అధికారులు రశీదు అందజేసి స్వామి దర్శనం కల్పించారు. ఆలయ ఉద్యోగి ఎల్.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెల్లింపుల్లో ఆలస్యం.. ఉద్యోగులను మోసం చేయడమే..



సమావేశంలో మాట్లాడుతున్న పాటి అప్పారావు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు 2013 సంవత్సరం పేస్కేల్‌కు సంబంధించి 50 శాతం బాండ్ల నగదు చెల్లించేందుకు రూ.281 కోట్లు మంజూరు చేసినా కార్మికులకు డబ్బు అందడం లేదని టీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పాటి అప్పారావు పేర్కొన్నారు. గురువారం ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన రీజియన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం బాండ్ల నిధులు మంజూరు చేసి 40 రోజులు గడుస్తున్నా ఆర్టీసీ యాజమాన్యం చెల్లించకపోవడం సరికాదన్నారు. ఉద్యోగుల సీనియారిటీ ఆధారంగా ప్రకారం నగదు చెల్లిస్తామనడం ఉద్యోగులను మోసం చేయడమేనని.. ఈ వ్యవహారంపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘటిత పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రీజియన్ అధ్యక్షుడు గుడిబోయిన శ్రీనివాస్, ఖమ్మం డిపో అధ్యక్ష, కార్యదర్శులు దేశబోయిన జగన్నాథం, బేతంపూడి బుచ్చిబాబుతో పాటు గోపాల్ రావు, నాగుల్ మీరా, రఘురాం, రాంబాబు, ఆర్.నాగేంద్రసింగ్, కె.నాగభూషణరావు, మందా రాయప్ప, సుందరం, రమణారావు, మధు, పవన్ కుమార్, లాజర్, హరినాథ్‌బాబు, రమాదేవి, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తపాలా.. రోజంతా కళకళ!

- ఖమ్మం హెడ్డాఫీస్‌లో ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు సేవలు
- రోజుకు రూ.1.50 కోట్లకు పైగానే లావాదేవీలు
- సేవలు వినియోగించుకుంటున్నది 1000 మందికి పైగానే..
- ఇక్కడే పాస్‌పోర్ట్, ఆధార్ సేవలు కూడా..



ఖమ్మం హెడ్ పోస్టాఫీస్‌లో వినియోగదారుల రద్దీ

ఖమ్మంగాంధీచౌక్: కొన్నేళ్ల క్రితం పోస్టాఫీస్ అంటే మనియార్డర్, లెటర్లు మాత్రమే గుర్తుకొచ్చేవి. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా బ్యాంకింగ్ సేవలే కాక.. పాస్‌పోర్ట్, ఆధార్ సేవలను సైతం అందుబాటులోకి తీసుకురావడంతో అన్ని వర్గాల ప్రజలు పోస్టల్ శాఖకు చేరువవుతున్నారు. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే బ్రిటిష్ కాలం నుంచి ఉన్న ఖమ్మంలోని హెడ్డాఫీస్ నగరవాసులకే కాక ఉమ్మడి జిల్లా ప్రజలకు సుపరిచితం. పూర్వం ఈ కార్యాలయంలో ఖమ్మం డివిజన్ సూపరింటెండెంట్ కార్యాలయంతో పాటు హెడ్ పోస్టాఫీస్ కూడా నిర్వహించేవారు. ఆ తర్వాత ఖమ్మం గాంధీచౌక్‌లోకి డివిజన్ కార్యాలయాన్ని తరలించి ఇక్కడ హెడ్డాఫీస్ మాత్రమే నిర్వహిస్తున్నారు. తొలినాళ్లలో ఉత్తరాల బట్వాడా, టెలీగ్రామ్‌లు, మనియార్డర్లు, పరీక్ష పేపర్ల బట్వాడా మాత్రమే నిర్వహించగా.. కాలక్రమంలో అన్నివర్గాల ప్రజలకు అవసరమయ్యే అనేక రకాల సేవలను అందిస్తున్నారు.

సగటున రూ.కోటికి పైగా లావాదేవీలు

ఖమ్మం హెడ్ పోస్టాఫీస్‌లో నిత్యం రూ.1.50 కోట్ల మేర లావాదేవీలు కొనసాగుతున్నాయి. పొదుపు పథకాలు, డిపాజిట్లు, పెన్షన్లు, ప్రభుత్వ పథకాలు, తపాలా జీవిత బీమా, మనియార్డర్లు, స్పీడ్ పోస్టులు, పార్సిళ్ల సేవలతో పాటు పాస్‌పోర్టు సేవలు, ఆధార్ సేవలు, స్టాంపుల విక్రయాలు వంటి వాటి ద్వారా ఈ లావాదేవీలు నమోదవుతున్నాయి. వీటితో పాటు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. దీంతో అన్ని వర్గాల ప్రజలు ప్రధాన కార్యాలయాన్నే ఆశ్రయిస్తున్నారు. ఇలా నిత్యం 1000 మందికి పైగా వినియోగదారులు ఇక్కడకు వస్తుండగా.. లావాదేవీలు రూ.కోటి దాటేశాయి.



ఆధార్ సేవలు అందిస్తున్న ఉద్యోగులు

పాస్‌పోర్టు, ఆధార్ సేవలు

పాస్‌పోర్ట్ తీసుకునేందుకు ఖమ్మం వాసులు పడుతున్న ఇక్కట్లను గుర్తించి.. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో పాస్‌పోర్టు కార్యాలయం మంజూరు చేయించారు. తద్వారా ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, భద్రాద్రికొత్తగూడెం, సూర్యాపేట జిల్లాల వాసులకు సేవలందుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ నిత్యం 90 స్లాట్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే, ప్రభుత్వం ఆధార్ సేవలను సైతం తపాలా కార్యాలయాలకు అప్పగించగా.. నిత్యం వందలాది మంది సేవలు పొందుతున్నారు. కాగా, ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయంలో సేవలకు అనుగుణంగా ఆ శాఖ ఉద్యోగులను కేటాయించింది. ఈ కార్యాలయంలో ప్రస్తుతం 38 మంది ఉద్యోగులకు గాను 32 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

తెల్లవారే మొదలు...

నాలుగున్నర లక్షల జనాభా కలిగిన ఖమ్మం నగరంతో పాటు ఉమ్మడి జిల్లా ప్రజల ప్రయోజనార్థం ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయం పనివేళలు నిర్దేశించారు. ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యాలయం పనిచేస్తుంది. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆర్థికేతర వ్యవహారాలకు సంబంధించిన సేవలందిస్తారు. ఇక ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆర్థిక, ఆర్థికేతర సేవలనూ అందిస్తున్నారు. అలాగే, రైల్వే పార్సిళ్లనూ తపాలా కార్యాలయం నుంచే పంపిస్తారు. ఖమ్మం రైల్వే తపాలా కార్యాలయం సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు పనిచేస్తోంది.

హెడ్ పోస్టాఫీస్‌లో అన్నిరకాల సేవలు



పోస్టల్ పని అంటే ఖమ్మం హెడ్డాఫీసే గుర్తుకొస్తుంది. గతంలో ఉత్తరాలు, మనియార్డర్లు, టెలీగ్రామ్ వంటి సేవలే ఉండేవి. ఇటీవల ఆధార్ సేవలు, బ్యాంకింగ్ సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి. దీంతో అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటోంది.

– ఎ.వెంకటేశ్వర్లు, ప్రకాష్‌నగర్, ఖమ్మం

ప్రభుత్వం నిర్దేశించిన సేవలన్నీ..



ప్రభుత్వం నిర్దేశించిన సేవలన్నీ ప్రజలకు అందిస్తున్నాం. ఖమ్మంతో పాటు పరిసర జిల్లాల ప్రజలు సేవలు వినియోగించుకుంటున్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు, వ్యాపారులు, మహిళలు, కార్మికులు ఈ కార్యాలయానికి ఎక్కువగా వస్తారు.

– కె.కిరణ్‌కుమార్‌రెడ్డి, పోస్ట్‌మాస్టర్, ఖమ్మం హెడ్ పోస్టాఫీస్

డిగ్రీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఅర్బన్: ఉమ్మడి జిల్లాలోని మహాత్మా జ్యోతి బాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఖమ్మంలో మహిళా డిగ్రీ కాలేజీ, కొత్తగూడెంలో పురుషుల డిగ్రీ కాలేజీ ఉండగా, ఆర్‌డీసీ సెట్–2024 ద్వారా ప్రవేశాలు కల్పించనున్నట్లు ఖమ్మం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వేంసాని వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఏప్రిల్ 12లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 28న ప్రవేశపరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉచితంగా విద్య, భోజన వసతితో పాటు యూనిఫాం, నోట్, టెక్ట్స్ పుస్తకాలు అందుతాయని తెలిపారు. వివరాలకు రఘునాథపాలెంలోని ఎస్ఎస్‌మూర్తి పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో కొనసాగుతున్న మహిళా గురుకుల డిగ్రీ కళాశాల లేదా 98481 61319, 80194 22103 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఏజెన్సీలో అభివృద్ధి ఆగొద్దు

- ఏప్రిల్ 10నాటికి పనులన్నీ పూర్తి కావాలి
- ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



ఇంజనీరింగ్, ఐటీడీఏ అధికారులతో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యాన జరుగుతున్న ఇంజనీరింగ్ అభివృద్ధి పనులను నిలిచిపోకుండా వేగం పెంచి పూర్తిచేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం నుంచి ఖమ్మం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన పలు అంశాలపై సమీక్షించారు. పాఠశాలల మరమ్మతు కోసం ఇప్పటికే నిధులు కేటాయించిన నేపథ్యాన విద్యార్థులకు అవాంతరాలు ఎదురుకాకుండా పనులు చేపట్టాలని తెలిపారు. అనంతరం ఐటీడీఏ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఈలు, ఏఈలతో సమావేశమైన పీఓ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన గ్రామాల్లో శ్మశాన వాటికలు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలలే కాక గిరిజన గ్రామాల్లో డ్రెయినేజీలు, సబ్ సెంటర్ల మరమ్మతులపై నివేదిక ఇవ్వాలని సూచించారు. ఇంకా పాఠశాలల మరమ్మతులపై ప్రతిపాదనలు సమర్పించి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే, ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా అదనపు గదుల నిర్మాణం చేపట్టి, ఫ్యాన్లు, లైట్లు, సమకూర్చాలని పీఓ తెలిపారు. తాగునీటి సమస్య ఉన్న చోట ఆర్వో ప్లాంట్ లేదా హ్యాండ్ బోర్ వేయించాలని సూచించారు. అన్ని పనులు ఏప్రిల్ 10 నాటికి పూర్తి చేసి బిల్లులు సమర్పించాలని తెలిపారు. ఈవిషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పీఓ హెచ్చరించారు. ఈ సమావేశాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, ఎస్ఓ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ల సర్వేలతో రైతన్నల ఆందోళన

- జిల్లాలోని నాలుగు మండలాల్లో మార్కింగ్
- రెండు రైల్వేలైన్ల నిర్మాణానికి ప్రతిపాదనల పేరిట ప్రచారం
- చకచకా సర్వే.. ఆపై పలుచోట్ల మార్కింగ్
- రైల్వేలైన్లు వస్తాయనే ప్రచారంతో భూముల ధరలపై ప్రభావం



రామచంద్రాపురం వద్ద వేసిన మార్కింగ్

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: కొద్ది నెలలుగా డోర్నకల్–మిర్యాలగూడ రైల్వేలైన్ ప్రతిపాదనలపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తుండగానే సర్వే సంస్థ బాధ్యులు మార్కింగ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోని నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలంలోని పలు గ్రామాల మీదుగా రైల్వేలైన్ నిర్మాణ ప్రతిపాదనలు రాగా... ఇక్కడి రైతులు ఎంపీలను కలిసి సమస్యను వివరించడంతో అప్పట్లో తాత్కాలికంగా వాయిదా పడింది. మళ్లీ ఇప్పుడు నేలకొండపల్లి మండలంలోని రామచంద్రాపురం వద్దే కాక అమ్మగూడెం వద్ద నంబర్లతో రాళ్లు ఏర్పాటు చేశారు. దీంతో డోర్నకల్–మిర్యాలగూడెం రైల్వేలైన్ పనులు మొదలుకానున్నాయనే ప్రచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల మీదుగా డోర్నకల్–గద్వాల రైల్వేలైన్ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా, డోర్నకల్–గద్వాల లైన్ కోసం ఖమ్మం రూరల్ మండలంలోని చింతపల్లి మీదుగా తిరుమలాయపాలెం మండలంలోని జగన్నాథపురం కూసుమంచి మండలం మీదుగా రైల్వే అధికారులు సర్వేచేసి మార్కింగ్ ఇచ్చారు. ఇలా పలుచోట్ల మా ర్కింగ్‌తో హద్దు రాళ్లు ఏర్పాటు చేయడం, జెట్ విమానం సర్వేకోసం చక్కర్లు కొట్టిన నేపథ్యాన త్వరలో పనులు మొదలుకానున్నాయని చెబుతున్నారు.

రైతుల్లో ఆందోళన..

తిరుమలాయపాలెం మండల కేంద్రంతో పాటు కూసుమంచి మండలాల మీదుగా డోర్నకల్–మిర్యాలగూడ, డోర్నకల్–గద్వాల లైన్ల నిర్మా ణం జరగనుందనే ప్రచారం జరుగుతోంది. అయితే, లైన్ల ప్రతిపాదనలపై ఏ శాఖ అధికారులూ స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొద్ది రోజుల క్రితం ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడు గుట్ట, తిరుమలాయపాలెం రైతు వేదిక, పాపాయిగూడెం సమీపాన మార్కింగ్ ఇచ్చారు. దీంతో ఈ ప్రాంత రైతులు తమ విలువైన భూములు రైల్వే లైన్ క్రింద కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే తిరుమలాయపాలెం మండలంలో తానంచర్ల, శ్రీరాంసాగర్, సీతారామ ప్రాజెక్టుల కింద విలు వైన భూములను కోల్పోగా ప్రస్తుతం రైల్వే లైన్లతో మళ్లీ భూములు కోల్పోవాల్సి వస్తుందా అన్న భయం వారిని వెంటాడుతోంది. మండల కేంద్రంలో ఎకరా కు రూ.50 లక్షల నుండి రూ.కోటి వరకు ధర పలుకుతుండగా రైల్వేలైన్ సర్వేలతో కొనుగోళ్లు, అమ్మకాలు పూర్తిగా నిలిచిపోయినట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోక్యం చేసుకుని రైల్వే లైన్ల మార్గాన్ని మార్చేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని రైతులు కోరుతున్నారు.